RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 10 సంచిక : 295 | సోమవారం 26 - 05 - 2025 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు : 08 | వెల : 2 రూ/-

తెలంగాణలో రాబోయే నాలుగు రోజుల్లో

## భారీ వర్షాలు..!


2

- గత నాలుగైదు రోజుల నుంచి తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి.
- అకాల వర్షాలతో అన్నదాతలు ఆగమవుతున్నారు.
- మరో నాలుగు రోజుల పాటు తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

హైదరాబాద్ : గత నాలుగైదు రోజుల నుంచి తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. అకాల వర్షాలతో అన్నదాతలు ఆగమవుతున్నారు. వరి ధాన్యం తడిసి ముద్దైపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మరో నాలుగు రోజుల పాటు తెలంగాణలో

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో

## కేటీఆర్ కీలక సమావేశం

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో కేటీఆర్ భేటీ
- ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో ప్రత్యేక సమావేశం
- కవిత లేఖ, వ్యాఖ్యలపై చర్చించినట్లు సమాచారం
- జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవాలపైనా మంతనాలు
- ఈ నెల 28న కేటీఆర్ అమెరికా పర్యటన


మిగతాది 2లో

హైదరాబాద్ :బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన కేటీఆర్, ఆయనతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పార్టీలో ఇటీవల చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు, రాబోయే కార్యక్రమాల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఇటీవల ఎమ్మెల్సీ కవిత, తన తండ్రి కేసీఆర్‌కు రాసిన అంతర్గత లేఖ బయటకు రావడం, ఆ తర్వాత ఆమె మీడియా సమావేశంలో "కేసీఆర్ దేవుడు.. కానీ, ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయి" అంటూ చేసిన వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లోనూ, రాజకీయంగానూ తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ లేఖ, కవిత వ్యాఖ్యలు, తదనంతర పరిణామాల నేపథ్యంలో కేసీఆర్ ను కేటీఆర్ కలవడం ప్రాధాన్యంత సంతరించుకుంది.

మన్‌కీ బాత్ ద్వారా ప్రధాని మోదీ

## దేశ ప్రజలతో మమేకమవుతున్నారు


2

- గ్రామీణ ప్రాంతాల్లో డ్రోన్ల వినియోగించడంపై మహిళలకు శిక్షణ ఇచ్చామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు.
- ఘటనలో 26మంది అమాయకులైన మన పర్యాటకులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.
- ప్రపంచంలో ఇలాంటి కార్యక్రమం ఎవరూ చేపట్టలేదని అన్నారు.

హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కీ బాత్ ద్వారా ప్రజలకు చాలా అంశాలపై అవగాహన కల్పిస్తున్నారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచంలో ఇలాంటి కార్యక్రమం ఎవరూ చేపట్టలేదని అన్నారు. ప్రధాని మోదీ ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారని చెప్పారు.

భారత్ వృద్ధికి గ్రోత్ ఇంజిన్‌గా ఏపీ..

## సీఎం చంద్రబాబు


2

వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి అన్ని రాష్ట్రాలు కలిసిరావాలని పిలుపునిచ్చారు.

అమరావతి : భారత్ వృద్ధికి గ్రోత్ ఇంజిన్‌గా ఆంధ్రప్రదేశ్ ఉండనుందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. నీతి ఆయోగ్ సమావేశం అనంతరం ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన ఎన్డీయే కూటమి రాష్ట్రల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు. 2047-వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి అన్ని రాష్ట్రాలు కలిసిరావాలని పిలుపునిచ్చారు. డేటా మేరకు భారతదేశం 2028 నాటికి 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని జోస్యం చెప్పారు. ప్రధాని మోడీ దార్శనిక నాయకత్వంలో ప్రపంచంలోనే దేశం 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా

## మారిన భారత్

### మోదీ నాయకత్వాన్ని కొనియాడిన పవన్



- మోదీ దార్శనికత వల్లే భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిందిన్న పవన్
- వికసిత్ భారత్-2047 వైపు వెళ్లేందుకు ఇదో ముఖ్యమైన అడుగని 'ఎక్స్'లో వెల్లడి
- "గత దశాబ్ద కాలంగా ఎన్డీయే సుపరిపాలనతో భారత్ అనేక రంగాల్లో వృద్ధి సాధించింది.

ఢిల్లీ: ప్రపంచంలో భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినట్లు నీతిఆయోగ్ ప్రకటించడంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు.

"మన్ కీ బాత్" లో తెలుగు రాష్ట్రాల అంశాలను

## ప్రస్తావించిన ప్రధాని మోడీ..

- "డ్రోన్ టెక్నాలజీ"ని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లడంలో ఈ పరిణామం ఒక గొప్ప ముందడుగు.
- "11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం" ఈ ఏడాది జూన్ 21 న విశాఖపట్నంలో జరగనున్న
- "డ్రోన్ దీదీలు" తెలంగాణలో వ్యవసాయంలో పెను మార్పులు తీసుకొస్తున్నారని వెల్లడించారు.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'యోగ ఆంధ్ర' అనే ప్రత్యేక ప్రచారం


2లో..

ఢిల్లీ: "మన్ కీ బాత్" లో తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై ప్రధాని మోడీ ప్రస్తావించారు. "డ్రోన్ దీదీలు" తెలంగాణలో వ్యవసాయంలో పెను మార్పులు తీసుకొస్తున్నారని వెల్లడించారు. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా మహిళలు డ్రోన్లతో వ్యవసాయం చేయడాన్ని మోడీ ప్రశంసించారు. "గ్రామీణ మహిళలు డ్రోన్ ఆపరేటర్లుగా శిక్షణ పొందారు. పంట్ల తోటలకు పురుగుమందులు, శీల్దార పిచికారీ కోసం డ్రోన్లను వినియోగిస్తున్నారు. సాంప్రదాయ పద్ధతులకంటే వేగంగా, సమర్థవంతంగా పురుగుమందులను పిచికారీ చేయవచ్చు. నీటిని, మందుల వినియోగాన్ని 30-40 శాతం వరకు తగ్గించవచ్చు. మహిళల ఆత్మవిశ్వాసం, స్వావలంబన పెరిగింది. "డ్రోన్ టెక్నాలజీ"ని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లడంలో ఈ పరిణామం ఒక గొప్ప ముందడుగు. కేంద్ర ప్రభుత్వం 'డ్రోన్స్ ఫర్ అగ్రికల్చర్' పథకం కింద

బంగాళాఖాతంలో అల్పపీడనం..

## ఏపీలో భారీ వర్షాలు


2

- ఈసారి నైరుతి రుతుపవనాలు త్వరగా ఏపీలోకి ప్రవేశిస్తుండటంతో రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.
- మరో 24 గంటల్లో రాయలసీమను రుతుపవనాలు చేరుకోనున్నాయి.

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. ఎండలతో పాటు వేడిగాడ్పులతో

ప్రధాని మోదీ సారథ్యంలో

## దూసుకెళ్తున్న భారత్

- ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ 10వ పాలక మండలి సమావేశం
- స్వర్ణాంధ్ర వికసిత్ భారత్ 2047 పై సీఎం చంద్రబాబు నాయుడు బ్లూ ప్రింట్‌ను ప్రదర్శించారు.
- ప్రపంచంలో నాలుగో ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.




మిగతాది 2లో

అమరావతి, మే 25: దర్శనికుడు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 4.2 ట్రిలియన్ డాలర్లతో భారత్.. ప్రపంచంలో నాలుగో ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ఆంధ్రప్రదేశ్ ముఖమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. తద్వారా జపాన్ ఆర్థిక వ్యవస్థను భారత్ దాటిందన్నారు. ఇక ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్) నివేదికల ప్రకారం.. 2028 నాటికి జర్మనీ ఆర్థిక వ్యవస్థను భారత్ దాటుతుందని తెలిపారు. దీంతో నాటికి భారత్ మూడో ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతుందని తెలిపారు. ఇలాంటి తరుణంలో అన్ని రాష్ట్రాలు వికసిత్ భారత 2047 లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. దేశం ఆ వైపు పయనిస్తున్న సమయంలో ఆంధ్రప్రదేశ్ గ్రోత్ ఇంజన్‌లా

ఆ విద్యార్థుల వివరాలు

## నాకు కావాలి: ట్రంప్


2

- హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థులపై ట్రంప్ తీవ్ర విమర్శలు
- 31% మంది విదేశీయులే, ఆర్థికంగా ప్రయోజనం లేదన్న ట్రంప్
- విదేశీ విద్యార్థుల వివరాలివ్వట్లేదని హార్వర్డ్‌పై ఆరోపణ
- ప్రభుత్వ నిర్ణయాన్ని నిలిపివేసిన అమెరికా కోర్టు
- ప్రభుత్వ చర్య రాజ్యాంగ విరుద్ధమన్న హార్వర్డ్ విశ్వవిద్యాలయం

ఢిల్లీ: వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విదేశీ విద్యార్థుల విషయంలో తమ ప్రభుత్వం తీసుకున్న వైఖరిని ఆయన గట్టిగా సమర్థించుకున్నారు. హార్వర్డ్‌లో దాదాపు మూడో వంతు మంది విదేశీ విద్యార్థులేనని, వారి వల్ల విశ్వవిద్యాలయానికి ఆర్థికంగా ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని ఆరోపించారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సోమవారం 26 - 05 - 2025

## ప్రధాని మోదీ సారథ్యంలో

# దూసుకెళ్తున్న భారత్

మొదటి పేజీ తరువాయి

స్వర్ణాంధ్ర 2047 సాధనకు కృషి చేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం తన ఎక్స్ ఖాతా వేదికగా సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ 10వ పాలక మండలి సమావేశం శనివారం న్యూఢిల్లీలో జరిగింది. ఈ సమావేశంలో స్వర్ణాంధ్ర వికసిత్ భారత్ 2047 పై సీఎం చంద్రబాబు నాయుడు బ్లూ ప్రింట్‌ను ప్రదర్శించారు. ఈ బ్లూ ప్రింట్‌పై ప్రధాని మోదీ ప్రశంసల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే.

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో కేటీఆర్ కీలక సమావేశం

మొదటి పేజీ తరువాయి

వీరిద్దరూ సమీక్షించుకున్నట్లు సమాచారం. మరోవైపు, జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పార్టీ ఆధ్వర్యంలో ఏ విధంగా నిర్వహించాలనే దానిపై కూడా వీరి మధ్య చర్చలు జరిగాయని తెలుస్తోంది. కాగా, కేటీఆర్ ఈ నెల 28వ తేదీన అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. జూన్ 1న అక్కడ నిర్వహించే ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఈ నేపథ్యంలో, అమెరికా పర్యటనకు ముందే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించిన పార్టీ కార్యక్రమాలపై ఒక స్పష్టమైన కార్యాచరణను రూపొందించేందుకే కేసీఆర్‌తో కేటీఆర్ చర్చించినట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి.

## "మన్ కీ బాత్" లో తెలుగు రాష్ట్రాల అంశాలను ప్రస్తావించిన ప్రధాని మోడీ..

మొదటి పేజీ తరువాయి

మహిళా సమూహాలకు రాయితీతో డ్రోన్లు అందిస్తోంది. శిక్షణా కేంద్రాలు, "డ్రోన్ లైసెన్సింగ్" సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయి." అని మోడీ వెల్లడించారు. ఈ మహిళలను "స్కై వారియర్స్"గా మోడీ సంబోధించారు.

## 12 ఏళ్లుగా ప్రేమలో ఉంటే, ఐశ్వర్యా రాయ్‌ని ఎందుకు పెళ్లి చేసుకున్నావ్..

అనంతరం ఏపీ గురించి మాట్లాడారు. "11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం" ఈ ఏడాది జూన్ 21 న విశాఖపట్నంలో జరగనున్న వేడుక గురించి ప్రస్తావించారు. విశాఖపట్నంలో జరిగే "అంతర్జాతీయ యోగా దినోత్సవం" కార్యక్రమంలో మోడీ హాజరవుతున్నట్లు తెలిపారు. విశాఖపట్నం ప్రకృతి సౌందర్యానికి ప్రసిద్ధి అని మోడీ కొనియాడారు. విశాఖ పరిసరాల్లో యోగా చేయడం అనుభూతిని మరింత గొప్పగా చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'యోగ ఆంధ్ర' అనే ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ యోగా ప్రాముఖ్యతను తెలియజేయడం, ప్రతి గ్రామానికి, పాఠశాలకు యోగా సాధన పరిచయం చేయడం లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో 10 లక్షల మందికి పైగా యోగా అభ్యాసకులు పాల్గొనబోతున్నాట్లు వెల్లడించారు. ప్రత్యేక శిబిరాలు, స్కూల్ యోగా ప్రోగ్రామ్‌లు, మెగా ఈవెంట్‌లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

## బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఏపీలో భారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి

ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమయంలో వాతావరణ శాఖ పండుగలాంటి వార్త తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ఏపీలో 3 రోజుల పాటు భారీ వర్షాలు కురవనున్నాయి. తీరం వెంట గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయనున్నాయి. పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. అయితే ఏపీలో నైరుతి రుతుపవనాలు సోమవారం ప్రవేశించనున్నాయి. మరో 24 గంటల్లో రాయలసీమను రుతుపవనాలు చేరుకోనున్నాయి. ఏపీలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రతి సంవత్సరం జూన్ మొదటి వారంలో ఏపీలోకి ప్రవేశించే రుతుపవనాలు ఈ సారి త్వరగా రాష్ట్రానికి రానున్నాయి. సాధారణంగా రుతుపవనాలు జూన్ 1వ తేదీ నాటికి కేరళ తీరాన్ని చేరుకుంటాయి. కానీ ఈ సారి మే 24నే రుతుపవనాలు ప్రారంభమయ్యాయి. ఈ రుతుపవనాలు కేరళ, తమిళనాడు, కర్ణాటక, మిజోరాం, తదితర రాష్ట్రాలను తాకి ఆంధ్రప్రదేశ్ వైపు కదలనున్నాయి. రుతుపవనాల రాకతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నం కానున్నారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఆ విద్యార్థుల వివరాలు నాకు కావాలి: ట్రంప్

అంతేకాకుండా, ఆ విద్యార్థులు వస్తున్న కొన్ని దేశాలు అమెరికాకు మిత్రదేశాలు కాకపోవచ్చని కూడా ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈ అంశాలపై ఆదివారం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ ఒక పోస్ట్ పెట్టారు. "హార్వర్డ్‌లో దాదాపు 31 శాతం మంది విద్యార్థులు విదేశీయులేనని, వారి విద్య కోసం ఆయా దేశాలు, కొన్ని సందర్భాల్లో అమెరికాకు ఏమాత్రం స్నేహపూర్వకంగా లేని దేశాలు కూడా ఒక్క పైసా చెల్లించడం లేదని, భవిష్యత్తులో చెల్లించే ఉద్దేశం కూడా వాటికి లేదని హార్వర్డ్ ఎందుకు చెప్పడం లేదు? ఈ విషయం మాకెవరూ చెప్పలేదు!" అని ట్రంప్ ప్రశ్నించారు. విశ్వవిద్యాలయానికి అమెరికా ప్రభుత్వం బిలియన్ల కొద్దీ డాలర్ల నిధులు సమకూరుస్తున్నప్పటికీ, విదేశీ విద్యార్థుల గురించి అడిగిన సమాచారం ఇవ్వడంలో హార్వర్డ్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ట్రంప్ విమర్శించారు. "ఆ విదేశీ విద్యార్థులు ఎవరో తెలుసుకోవాలనుకుంటున్నాం. ఇది సహేతుకమైన కోరిక, ఎందుకంటే మేము హార్వర్డ్‌కు బిలియన్ల డాలర్లు ఇస్తున్నాం. కానీ హార్వర్డ్ ఆ వివరాలు వెల్లడించడం లేదు. మాకు ఆ విద్యార్థుల పేర్లు, వారు ఏ దేశాలకు చెందినవారో తెలియాలి. హార్వర్డ్ వద్ద 52 మిలియన్ డాలర్లు ఉన్నాయి, వాటిని వాడుకోండి. అంతేగానీ, ఫెడరల్ ప్రభుత్వం మీకు నిధులు మంజూరు చేయాలని అడగడం మానండి!" అంటూ ట్రంప్ ఘాటుగా వ్యాఖ్యానించారు. కాగా, అంతర్జాతీయ విద్యార్థుల నమోదుకు హార్వర్డ్‌కు ఉన్న అధికారాన్ని ఉపసంహరించుకోవాలని ట్రంప్ యంత్రాంగం చేసిన ప్రయత్నాన్ని శుక్రవారం ఒక అమెరికా కోర్టు నిలిపివేసింది. విద్యావిధానాలను ట్రంప్ విధానాలకు అనుగుణంగా మార్చాలన్న వైట్‌హౌస్ ప్రయత్నాలకు ఇది అడ్డంకిగా మారింది.

## తెలంగాణలో రాబోయే నాలుగు రోజుల్లో భారీ వర్షాలు..!

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 26న ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మంగళ, బుధవారాల్లో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలో.మీ. వేగంతో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. 29న రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది అని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## మన్‌కీ బాత్ ద్వారా ప్రధాని మోదీ దేశ ప్రజలతో మమేకమవుతున్నారు



ప్రతినెలా చివరి ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలతో మమేకమవుతున్నారని తెలిపారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ సనత్‌నగర్‌లోని లింగయ్య నగర్‌లో స్థానికులతో కలసి కిషన్‌రెడ్డి ఈ కార్యక్రమం వీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో డ్రోన్లు వినియోగించడంపై మహిళలకు శిక్షణ ఇచ్చామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. వారు వ్యవసాయానికి సంబంధించిన వివిధ పనుల కోసం డ్రోన్లను వినియోగిస్తున్నారని తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పాకిస్థాన్ ఉగ్రవాదులు జరిపిన ఘటనలో 26మంది అమాయకులైన మన పర్యాటకులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మన సైనికులు పాక్ ఉగ్ర శిబిరాలపై దాడులు జరిపి నాశనం చేశారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం అవడంతో దేశవ్యాప్తంగా తీరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఉగ్ర దాడులను సమర్థంగా ఎదుర్కోవడంలో మన సైనికులు ముందున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మరోవైపు ప్రధాని మోదీ ఇవాళ(ఆదివారం) జరిగిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో తెలంగాణలోని డ్రోన్‌దీదీలను ప్రశంసించారు. సంగారెడ్డి జిల్లాలో మహిళలు డ్రోన్లతో వ్యవసాయం చేస్తున్నారని వివరించారు. గ్రామీణ మహిళలు డ్రోన్ ఆపరేటర్లుగా శిక్షణ తీసుకున్నారని చెప్పారు. పండ్ల తోటలపై పురుగు మందులు వాడటానికి డ్రోన్లను వినియోగించారని తెలిపారు. ఈ క్రమంలో డ్రోన్ దీదీలను స్కైవారియర్స్‌గా ప్రధాని మోదీ అభివర్ణించారు.

# నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిన భారత్

మొదటి పేజీ తరువాయి



ఈ చారిత్రక విజయం ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వానికి, ఎన్డీయే ప్రభుత్వ ప్రగతిశీల పాలనకు నిదర్శనమని పవన్ కొనియాడారు. "గత దశాబ్ద కాలంగా ఎన్డీయే సుపరిపాలనతో భారత్ అనేక రంగాల్లో వృద్ధి సాధించింది. ఇది కేవలం ఆర్థిక విజయం మాత్రమే కాదు. ప్రపంచంలో నవభారత్‌కు పెరుగుతున్న ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తోంది. 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు, వికసిత్ భారత్-2047 వైపు నడిచేందుకు ఇది ఓ ముఖ్యమైన అడుగు" అని పవన్ కల్యాణ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. అయితే ప్రపంచంలో జపాన్‌ను అధిగమించి భారత్ 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం వెల్లడించిన విషయం తెలిసిందే. దేశ స్థూల దేశీయోత్పత్తి 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడంతో అమెరికా, చైనా, జర్మనీ తర్వాత స్థానంలో నిలిచిందన్నారు. 10వ నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రపంచ అస్థిరత, సవాళ్ల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా కొనసాగుతూ ఒక మార్గదర్శిగా నిలుస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడులకు గమ్యస్థానంగా దేశం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుండటంతో ఈ ఘనత సాధ్యమైందన్నారు. 3 ఏళ్లలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనున్నామని వెల్లడించారు.

# మలేషియా ఏజెంట్ మీద మన్ను వడ..!

ఆ మలేషియా ఏజెంట్ మీద మన్నువడా.. అన్ని నమ్మికొని వోయినందుకు నా బతుకు పెనం మీంచి పొయ్యిల వడ్డట్టయ్యింది. పొయ్యంటే మతికొచ్చింది, మలేషియాలోని మలాక సిటీనే నా ఇలాక. అక్కడ అల్యూమినియం కంపెనీల పన్జేసెటోన్ని. నేను పొయ్యి కింద మంటవెడ్తనే పైన అల్యూమినియం కరిగి నీళ్ల లెక్క అయ్యేది. పొయ్యి నుంచి అచ్చే శెకకు నేన్గూడ మాడి మసయ్యేటోన్ని. ఆ కంపెనీలనే బువ్వ దిని, ఆ కంపెనీలనే నిర్దవోయేటోన్ని. పొద్దుగాళ్ల పోవుడు, పొయ్యిల కొర్కాసులు ఎగదోసుడు, పొద్దూకి రూంకు వచ్చి ఇంత సల్లవడి నడుమాల్సుడు. రోజిదే పని.ఎప్పట్లెక్కనే ఆ రోజు గూడ అదే పనికి వొయిన. మజ్జాన్నం మూడు గొడ్తున్నది. అక్కడి సీఐడీ పోలీసులట, మా కంపెనీల దొంగలు వడ్డట్టే ఉర్కచ్చిర్రు. ఏ మన కోసం గా పోలీసులెందుకస్తరని నా పని నేన్జేసుకుంటున్న. ఖతం రానే అచ్చిర్రు నా దగ్గరికి పోలీసులు. 'గురిజాల రాజేశ్వర్ నువ్వేనా' అని మలయి భాషలడిగిర్రు. 'నేనే' అన్జెప్పిన. అంతే..'పోదాం పా' టేషన్‌కు అని నన్ను వట్కపోయిర్రి. నేనేం దొంగతనం జెయ్యలె, లేకుంటే మలేషియా మనిషిని మర్డర్ జెయ్యలె. మరె, పోలీసులు నన్నెందుకు వట్కపోయిర్రో తెలుసా..? దొంగ వీసా మీద అక్కడ బతుకుతున్ననట. ఆ విషయం అప్పటిదాన్క నాగ్గూడ తెల్వదు. ఏజెంటును నమ్మికొని డబ్బు వేల రూపాలు ఆయన శేతిల వెడ్తే ఈ పనికి కుదిరిపిచ్చిండు. నేనేం జెప్పినా పోలీసులు ఇన్లేదు. వాళ్లనుకున్న పన్జేసిర్రు. ఆ రోజు నాత్రంతా పోలీస్టేషన్లనే పండుకున్న గనీ నిద్రవడితే ఒట్టు. నా పెండ్లాం సత్తవ్వ, కొడుకు వినయ్, బిడ్డ మానసలే గుర్తురావట్టిర్రు. 'మన కొడుక్కు పానం మంచిగలేదు, డాక్టర్లు ఆప్రీషన్ జేస్తనే మంచిదంటున్నరు', 'డాక్టర్లకన్న మనకెక్కువ ఎరుకనా? నేన్ పైసల్ పంపిస్తా, నువ్వేం రందివడకు. ముందుగాల్ల వాన్నైతె దావకాన్ల షరీఖ్ జెయ్యి'మని అదేరోజు పొద్దున ఫోన్ల సత్తవ్వతోని జెప్పిన ముచ్చట యాదికొచ్చి కండ్ల పొంటి నీళ్లు వట వటా రాలవట్టినయి. నాత్రంత నిలవడ్డ కన్లు నిలవడ్డట్టే ఉన్నయి గని నిద్ర మాత్రం వట్టలె. కతం, తెల్లారనే తెల్లారె.. అరెస్టయిన ముచ్చట ఒక్కపారి ఫోన్జేసి చెప్తే మంచిగుండని పానం ఇంటిమొకాన గుంజింది. కనీ, మనకు ఫోన్ ఇచ్చేటోళ్లెవ్వల్లేరాయె! ఇంతల, దేవునిలెక్క రానే అచ్చిండు ఓ పెద్ద మనిషి. ఆ పెద్దాయన ఫోన్లకెల్లి వినయ్‌కి ఫోన్జేసిన. 'నాన్న.. ఇగో, ఇప్పుడే ఆప్రీషన్ రూంలకు వోతున్న' అని నా అరెస్టు ముచ్చట చెప్పకముందే వాడు, వాని గురించి చెప్పవట్టిండు. పోరడు బెంగటీలదిక్క అని 'ఏం గాదు బిడ్డ, ధైర్నంగుండు, ఫోన్ అమ్మకియ్యి'మన్న. ఫోన్దీసుకున్న సత్తవ్వకు.. 'నేను ఫోన్జేత్తలేనని రందివెట్టుకోకు, పోరగాండ్లు జాగర్త' అని నేను అరెస్టయిన ముచ్చట జెప్పిన. ఆ ఫోన్లనే ఏడ్వవట్టింది సత్తవ్వ. 'ఎహ్వా ఊకో.. ఏం గాదు, ఎందుకేడుస్తున్నవ్' అని ధైర్నం జెప్పంగనే పోలీసాయన అచ్చి ఫోన్ గుంజుకున్నడు. తీస్కపొయి లాకప్లేసిండు. మలేషియాల కేసు ఫైలయ్యేదాన్క లాకప్‌లేస్తరు. కేసు ఫైలయినంక జైలుకు పంపుతరు. లాకప్ నుంచి కోర్టుకు, కోర్టు నుంచి లాకప్‌కు పోలీసులు పదిహేడు



రోజులు తిప్పిర్రు. ఒక లాకప్‌ల ఎనిమిది మంది ఉంటరు. లాకప్ మొత్తం శిమ్మశీకటి, ఒగని భాష ఒగనికి రాదు. పదిహేడు రోజుల తర్వాత కేసు ఫైలైంది. మమ్మల్ని ఇడ్శిపెడ్తదనుకున్న కోర్టు జైలుకు పంపింది. అమ్మో%ౕ% అసొంటి కట్టం పగోనిగ్గూడ రావద్దు. ఆ జైలు ఎట్లుంటదంటే..? కోళ్ల ఫారం కన్న అటీనముంటది. శిమ్మశీకటి, గొర్లను గదా ఏసినట్టు ఒక్క ఫారంల ఎనభై మందినేసిర్రు. తిండీ, గిండీ అన్ని అన్లనే. నీళ్ల లెక్క ఉండే సాస్‌తోని రోజుకు రెండు పూటల బువ్వ సగం కడుపుకే వెట్టిర్రు. అన్ల కొంచెం ఎక్కువ బలమున్నోడు పళ్లెం గుంజుకొని తిన్నా మనం జేసేదేం ఉండదు. నేనొక్కన్నే గాదు, మొత్తం ఆరుగురుం, ఆర్నెళ్లు ఆ జైళ్లనే గడిపినం. ఐదుగురం నిర్మల్ జిల్లా కడెం మండలం లింగాపూరోళ్లమైతే, పక్కూరు ఒకతనిది. నెల.. రెణ్నెళ్లు.. మూణ్నెళ్లు%ౕ% చూసీ చూసీ మా ఇంటి ఆడోళ్ల కండ్లు కాయలు గాసినట్టున్నయి. ఊరి లీడర్లను వట్టుకొని రాష్ట్రంల ఉన్న కాంగ్రెస్ పార్టీ, సంటర్ల ఉన్న బీజేపీ నాయకుల సుట్టు తిరిగీ తిరిగీ కాళ్ల చెప్పులనరిగినయట గనీ, వాళ్ల కండ్లళ్ల నీళ్లు మాత్రం కారుడాగలె. కాంగ్రెస్ మంత్రి సీతక్క, బీజేపీ ఎంపీ గోడం నగేశ్‌ల దగ్గరికి వొయి దరఖాస్తులు వెట్టుకుంటే, ఆ వార్త అన్ని పేపర్లల్ల అచ్చిందట గనీ, మేం మాత్రం మా ఇంటికి రాలె, మావోళ్లు మా కండ్లకు కనవడలె. ఇగ మా ఆడోళ్లకు వశపడక కేటీఆర్ సారైతనే మమ్మల్ని ఇంటికి తీస్కొస్తడని నమ్మి భూక్యా జాన్సన్ నాయక్ సార్ దగ్గర్కి వోయిర్రట. నాయక్ సార్ వీళ్లను కేటీఆర్ దగ్గర్కి తీస్కవోతే.. 'మీవోళ్లను తెలంగాణకు తీస్కచ్చే బాధ్యత నాది' అని కేటీఆర్ సార్ ఇమ్మతిచ్చిండట. ఆర్నెళ్లు జైళ్ల గడిపినందుకో, ఏమో నా ఆరోగ్యం మొత్తం కరాబైంది. ఓ రోజు పొద్దున్నుంచి వెడితే మజ్జాన్నం దాన్క ఒగ కక్కుడు గాదు. బీపీ 190 దాకా వెర్గింది. మా పనైపోయింది. ఇగ సచ్చుడే గావచ్చు. మమ్మల్ని మావోళ్లకన్న సూపెడుతరో, సూపెట్టరో అని రోజు కుమిలి కుమిలిపోతున్నం. ఇంతల.. 2025 మార్చి 5వ తారీఖు నాడు మలేషియా జైళ్ల ఉన్న మా దగ్గర్కి జాన్సన్ నాయక్ సారొచ్చిండు. ఆయనను సూడంగనే మా ఆరుగురికి దుక్కమాగలె. ఏడ్సుకుంటచ్చి అమాంతం ఆయన కాళ్ల మీద వడ్డం. 'రాజేశ్వరన్నా.. గిదేం పనే. మీరు గిట్లేడుస్తరా? మనకు కేటీఆర్ సారున్నడు. మిమ్మల్ని తెలంగాణకు తీస్కరమ్మని ఆయనే నన్ను మీ దగ్గర్కి తోలిండు' అని చెప్పవట్టిండు. పాపం నాయక్ సార్ మా కోసం మలేషియాకు నాలుగు మాట్ల అచ్చిండట. ఎవ్వల్ని కల్సిర్రో, ఎంత కర్సు వెట్టుకున్నరో మాకేం తెల్వదు. మేం మాత్రం 2025, ఏప్రిల్ 17 నాడు జైళ్లకెల్లి బైటికచ్చినం. 2025, మే 21 నాత్రి రెండు గంటలకు శంషాబాద్ ఏర్పోర్టుకు శేరుకున్నం. ఆ నాత్రి హొటళ్ల పండుకున్నం. సీన్ కట్‌జేస్తే.. మజ్జాన్నం ఒంటిగంట కొడుతున్నది. మా కారొచ్చి సక్కగ నందినగర్‌ల ఆగింది. మేం దిగంగనే నా పెండ్లాం పిల్లలొచ్చి మీదవడి ఒక్కటే ఏడ్సుడు. అందరం గల్సి కేటీఆర్ సార్ దగ్గర్కి వోయి రెండుజేతులా దండం బెట్టినం. కేటీఆర్ సార్ మమ్మల్ని గుండెలకత్తుకున్నడు. మా అవ్వతోడు జెప్తున్నా%ౕ% మేం బతికి మళ్ల బట్టకడుతమని మాత్రం అనుకోలె. మాకు పునర్జన్మనిచ్చింది మాత్రం కేటీఆర్ సారే. అదే 2025, మే 21నాడు నాత్రి అందరికందరం ఇంటికి చేరుకున్నం.

# కల్వకుంట్ల కవిత సూచనలు శాస్త్రీయమైనవి, ఆలోచింపజేసేవి, ఆచరణీయమైనవి.



### కల్వకుంట్ల కవిత సూచనలు శాస్త్రీయమైనవి, ఆలోచింపజేసేవి, ఆచరణీయమైనవి.

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ప్రియ తనయ, ఎమ్మెల్సీ కవిత అంతర్గతంగా రాసిన లేఖ బహిర్గతం కావడం పెద్ద చర్చనీయాంశం అయ్యింది. ఆ లేఖాస్త్రంలో సంధించిన ప్రశ్నలు మాత్రం కండ్లలో కలకలాంటివి. నిజానికి ఇవి బాధ కలిగించినా, కంటిలోని మలినాలను తొలగించి కళ్లు శుభ్రం చేస్తాయి. కవిత తండ్రికి ప్రేమతో రాసిన లేఖలో ఉన్న ప్రశ్నలు కూడా దరిదాపుగా అలాంటివే. తండ్రి మీద ప్రేమతో డియర్ డాడీ! అని సంబోధిస్తూనే అనుకూల, ప్రతికూల అంశాలను లోతుగా తడమడంలో వెనకాడలేదు.

### ఉగ్రదాడుల్లో 20 వేల మంది భారతీయులు మృతి.. ఐరాసలో భారత ప్రతినిధి స్పష్టం

ఇటీవల ఆ పార్టీ రజతోత్సవం వేదిక మీద పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ప్రసంగం పైనే తన ఫోకస్ పెట్టారు. నాణానికి బొమ్మ, బొరుసు ఎలాగో నాయకత్వానికి అనుకూల, అననుకూల అం శాలేమిటో కూడా తేల్చి చెప్పడం భేషుగ్గా ఉన్నది. ప్రాంతీయ పార్టీలలో అధినాయకత్వానికి ఇలా చెప్పే స్వేచ్ఛ చాలా తక్కు వగా ఉంటుంది. పార్టీ అధ్యక్షుడి కూతురైనందువల్ల ఈ సాహసం చేయగలిగారు.. ఇది మరెవరి వల్లా అయ్యే పని కాదే మో? తమ పార్టీ లుకలుకలతో కుప్పకూలి పోకూడదనే రాజ కీయ పరిణితితో కవిత ఈ విధంగా లేఖ రాసినట్టు అర్థం అవుతుంది.

### దేశ రహస్యాలు అమ్మడం.. దేశ భద్రతకు ప్రమాదకరం!

### ప్రజాస్వామ్యం కొరవడిందంటూ..

ఇప్పటికిప్పుడు బీఆర్ఎస్ పార్టీలో అంత ప్రమాదకర పరిస్థితులు లేకపోయినా, అంతర్గత ప్రజాస్వామ్యం అయితే లేదనే విషయాన్ని చర్చకు తెచ్చారు. అధినాయకుడు కార్యకర్తలకు అందుబాటులో లేకపోవడం, మామూలు నాయకులను కూడా కలవకపోవడం, ఎన్నికల సందర్భంగా, బహిరంగ సభ సమయంలో మాత్రమే ప్రజల్లోకి రావడం, పాత కాపులకే మళ్లీ అధికారాలు కట్టబెట్టడం, వారిపై ఉన్న వ్యతిరేకతను పరిగణలోకి తీసుకోకపోవడం సరైనది కాదన్నది కవిత చేసిన సూచనలలో ప్రధానమైనది. గత ఎన్నికల సమయంలో సిట్టింగులకే బీఫామ్‌లు ఇవ్వడంతో తీవ్ర వ్యతిరేకత ఉన్న స్థానాలు కోల్పోవలసి వచ్చింది. ఈ కారణంగా అధికారమే కోల్పోవలసి వచ్చింది. కొత్త నాయకత్వం పార్టీకి అందకుండా పోయింది. నిరంతరం పాతా కొత్త కలయికలతోనే ముందుకు సాగడం వల్ల సుదీర్ఘకాలం పార్టీని అధికార అందలం వైపు నడపడం, నిలబెట్టడం సాధ్యమవుతుంది. విపరీతమైన జన సమీకరణ చేసి కూడా కొన్ని అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా వదిలి పెట్టడం వల్ల ప్రజలలోకి సరైన సందేశం వెళ్లలేదని కవిత గుర్తు చేశారు.

### అజ్ఞానాన్ని తరిమిన విజ్ఞాన సారథి

### ఇలాగే కొనసాగితే భవిష్యత్ కష్టమంటూ..

దళితులకు రిజర్వేషన్లు, వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై, బీసీ కోటా పెంపు తదితర అంశాలపై స్పష్టత ఇవ్వకపోవడం సరికాదనే భావనను కవిత వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ని దునుమాడిన చోట, కేంద్రంలోని బీజేపీపై సరైన విమర్శలు చేయకపోవడం తప్పుడు సంకేతాలు ఇచ్చింది. బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు ఉందని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారానికి ఇది బలాన్ని ఇచ్చిందని నొక్కి వక్కాణించారు. సరైన రాజకీయ వైఖరి ప్రకటించని కారణంగానే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగోలా నెట్టుకొచ్చినా, పార్లమెంటు ఎన్నికలకు వచ్చేసరికి పార్టీ పూర్తిగా చతికిలపడి పోయిందన్నది నిష్ఠుర సత్యం. వీటిలో వేటినీ సరి చేసుకోకుండా ఇలాగే కొనసాగితే భవి ష్యత్తు ఎన్నికలు కూడా ఇబ్బందులు కలిగిస్తాయి అన్నారు. రాబోయే కాలంలో ఎన్నికలను ఎదుర్కోవడం అంత ఆషామాషీ కాదని తేల్చి చెప్పారు. పార్టీ మొత్తం తానై నడుపుతున్న కేసీఆర్, ద్వితీయ శ్రేణి నాయకత్వంపై ఫోకస్ చేయకపోవడం వల్ల, ప్రత్యర్థి రాజకీయ పార్టీల తీరును ఎండ కట్టడంలో విఫలమవుతామన్న ఆమె సలహా పాటించదగ్గదే కాదు, అమలు చేయవలసింది కూడా.

### కార్మికులుగా గుర్తించకపోతే కోల్పోయే ప్రయోజనాలు..

### సభ విజయవంతమైనప్పటికీ..

పార్టీ అధ్యక్షుడి ప్రసంగంపై విమర్శలకే పరిమితం కాకుండా ప్రసంగంలోని గొప్పతనాన్ని కూడా కవిత హుందాగా వివరించారు. కగార్ వ్యతిరేక నినాదం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఫెయిల్ అయిందని మెప్పించే ప్రయత్నం, పహెల్గాం ఘటనపై మౌనం, రాష్ట్ర ప్రభుత్వ నేత పేరు రాకుండా మాట్లాడటం భేషుగ్గా ఉందని మెచ్చుకున్నారు. అయితే కేసీఆర్ ప్రసంగంలో ఉండే ఛలోక్తులు, వ్యంగ్యాలు, ప్రత్యర్థులపై వేసే చురకలు తగ్గాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనా సభ ఘనంగా జరగడం, భారీగా జనం తరలి రావడం చూస్తుంటే పార్టీకి జనంలో ఉన్న ఆదరణ ఇంకా ఏమాత్రం తగ్గలేదని స్పష్టమవుతుందని వివరించారు. అయితే శాసనమండలి సభ్యురాలిగా ఇంతటి వివరణతో కూడిన లేఖ రాయడం కానీ, సూచనలు చేయడం కానీ ఒక ప్రాంతీయ పార్టీలో సాధ్యం కాదు. కూతు రుగా అయితేనేమి, ఒక మహిళగా ఆ పార్టీలో డైనమిక్ లీడర్‌గా ఫోకస్ కావడం వల్ల తను ఈ సూచన చేయగలిగి ఉండవచ్చు. పార్టీ అధిష్టానానికి ఆత్మ విమర్శ చేసుకునే అవకాశాన్ని గుర్తు చేశారు..

### ఆమె సలహాలు పాటించదగ్గవే!

పార్టీని విజయపథంలో నడపాలంటే, అధికార అందలం చేజిక్కించుకోవాలంటే అధ్యక్షుడు నాయకత్వానికి, కార్యకర్తలకూ ఎప్పటికప్పుడు తగు సలహాలు ఇస్తూ, అప్రమత్తులను చేస్తూ సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంటుంది. పార్టీ పనితీరుపై నిరంతర పర్యవేక్షణ, సరైన శిక్షణలతోనే ఇది సాధ్యం. అందుకుగాను క్రింది స్థాయి నుంచి పై స్థాయి వరకు నిర్మాణాలను బలోపేతం చేసుకోగలగాలి. గతంలో తాము చేసిన ప్రజోపయోగమైన పనులను ప్రజలకు నిరంతరం గుర్తు చేస్తుండాలి. ప్రత్యర్థుల బలహీనతలను, తప్పులను ఎప్పటికప్పుడు ఎండగట్టగలగాలి. ప్రత్యర్థి రాజకీయ పార్టీలను, వైఖరులను, పాలన లోపాలను వివరిస్తూ బలహీనపరచగల యం త్రాంగాన్ని తయారు చేసుకోవాలి. ఏ రాజకీయ పార్టీ బలోపేతానికైనా పనికివచ్చే, ఉపయోగపడే అంశాలివి. ఈ విషయాలన్నింటినీ కవిత చాలా సున్నితంగా తట్టి చూపారు. కేసీఆర్‌ని తన తండ్రి గానే కాక, పార్టీ అధ్యక్షులుగా భావించి ఆమె చేసిన సూచనలు శాస్త్రీయమైనవి. ఆలోచింపదగినవి. ఆచరించదగినవి.

# గుండె పగిలే వేదన.....

## అకాల వర్షాలకు రైతుల ధాన్యం మొలకలు.. అధికారుల నిర్లక్ష్యంపై నిప్పులు!



**నిర్మల్ /మే 25/తెలంగాణ సేన న్యూస్ :** నిర్మల్ జిల్లాలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం అకాల వర్షాల బారిన పడి తీవ్ర నష్టాన్ని చవిచూస్తోంది. కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి వేచి ఉన్న ధాన్యం వర్షాలకు తడిసి, మొలకెత్తుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. అధికారులు 60-80% కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా ఉంది. "మరో మూడు రోజులలో ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తాం" అంటూ అధికారులు ప్రకటనలు చేస్తున్నా, ఆచరణలో మాత్రం జాప్యం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల మాటలు.. రైతుల కష్టాలు..**

నిర్మల్ జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 1.22 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 1.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందుకోసం 318 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 1.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అంటే ఇంకా 30 వేల నుంచి 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే, కొనుగోలు ప్రక్రియ వేగవంతం కాకపోవడం, లారీల కొరత, గన్నీ సంచుల సమస్యలు రైతులను నిండా ముంచుతున్నాయి.

పలు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలు వర్షాలకు తడిసి ముద్దయ్యాయి. కల్లాల్లోనే ఆరబెట్టిన వరి ధాన్యం కూడా వర్షాలకు కొట్టుకుపోయింది. కొంతమంది రైతులు మూడు వారాలుగా కొనుగోలు కేంద్రాల వద్దే భార్యాపిల్లలతో కలిసి జాగారం చేస్తున్నామని వాపోతున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం మొలకెత్తుతున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెడితేనే తూకం వేస్తామని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెబుతుండటంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. ఇది అధికారుల నిర్లక్ష్యానికి, అలసత్వానికి నిదర్శనమని రైతులు మండిపడుతున్నారు.

**ప్రకృతి ప్రకోపం.. ప్రభుత్వ వైఫల్యం..**

అకాల వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు చల్లడమే కాకుండా, ప్రభుత్వ కొనుగోలు విధానంలోని లోపాలను కూడా స్పష్టంగా బయటపెట్టాయి. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, కొనుగోలు కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, రవాణా సమస్యలు, సరిపడా గన్నీ సంచులు లేకపోవడం వంటి సమస్యలు ఏళ్ల తరబడి రైతులను వేధిస్తున్నా, వాటికి శాశ్వత పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమవుతోందని రైతులు ఆరోపిస్తున్నారు.

కొన్ని చోట్ల రైతులు రోడ్డెక్కి రాస్తారోకోలు నిర్వహించగా, స్థానిక ఎమ్మెల్యే, అధికారులు హామీలు ఇచ్చి ఆందోళనలను విరమింపజేశారు. అయితే, ఈ హామీలు కేవలం మాటలకే పరిమితం కాకుండా, ఆచరణలో చూపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. తడిసిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నా, మొలకెత్తిన ధాన్యాన్ని ఎవరు కొంటారన్న ప్రశ్న రైతులను వెంటాడుతోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే నాశనమవుతుంటే, రైతన్న గుండె పగిలేలా రోదిస్తున్నాడు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. లేనిపక్షంలో తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, భవిష్యత్తులో వ్యవసాయంపై ఆశలు కోల్పోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సామిల్ వ్యాపారి ప్రభాకర్ ఔదార్యం - కొత్త బట్టల పంపిణీ

## మునిసిపల్ సిబ్బందికి విందు భోజనం







**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి మే 25:** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలోని ప్రతాపవాడకు చెందిన నవజీవన్ సామిల్ వ్యాపారి రావుల ప్రభాకర్ మున్సిపల్ సిబ్బంది సుమారు 150 మందికి పైగా విందు భోజనం పెట్టడంతో పాటు కొత్త బట్టలను అందజేసి తన ఔధార్యాన్ని చాటుకున్నాడు. వివరాలలోకి వెళితే ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన సామిల్ వ్యాపారి రావుల ప్రభాకర్ - శ్రీమతి దంపతుల కుమారుడు రావుల నాగేంద్ర- తారల వివాహ రిసెప్షన్ ఆదివారం స్థానిక వెంకటసాయి గార్డెన్ లో రంగ రంగ వైభవంగా నిర్వహించారు. ప్రభాకర్ శ్రీమతి దంపతులు కుమారుని వివాహాన్ని పురస్కరించుకొని హుజురాబాద్ మునిసిపల్ కార్మికులు 150 మందికి పైగా కుటుంబాలతో సహా ఆహ్వానించి పెళ్లి విందు భోజనం పెట్టడంతో పాటు మహిళలకు చీరలు, జాకెట్ పీసులు అందజేయగా పురుషులకు ప్యాంటు, షర్టు పీస్ లను అందజేశారు. వివాహానికి హాజరైన బంధుమిత్రులతో పాటు హుజురాబాద్ పట్టణానికి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు అందరూ అతిథుల చేతుల మీదుగా మున్సిపల్ సిబ్బందికి బట్టలను అందజేశారు. పెళ్లి విందుకు ఆహ్వానించడమే ఎంతో భారంగా భావించే నేటి తరుణంలో ప్రభాకర్ తన కుమారుని వివాహాన్ని పురస్కరించుకొని కుమ్మరివాడ, ప్రతాపవాడ, ఫకీర్వాడ, శివాజీ నగర్, హనుమాన్ టెంపుల్ ఏరియా, వరంగల్ రోడ్ ఏరియా, విద్యానగర్ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు రెండు వెయ్యిల మందికి పైగా ప్రజలను ఆహ్వానించి (పెళ్లి)విందు భోజనం ఏర్పాటు చేశారు. ప్రభాకర్ శ్రీమతి దంపతులు మున్సిపల్ సిబ్బందికి సుమారు 75 వేలకు పైగా విలువ చేసే బట్టలను పంపిణీ చేసి తమ ఔదార్యంను చాటుకున్నందుకు మున్సిపల్ సిబ్బంది కృతజ్ఞతలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు అభినందనలు తెలిపారు.

# ములుగు జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలి



**ములుగు తెలంగాణ సేన :** ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ములుగు జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి సమావేశంలో మహిళా కాంగ్రెస్ పార్టీలో నూతనంగా నియామకం అయిన వారికి నియామక పత్రాలు అందించడం జరుగుతుంది. ముఖ్యంగా మహిళా కాంగ్రెస్ ములుగు బ్లాక్ అధ్యక్షురాలిగా చాపల ఉమాదేవి మరియు ఏటూరునాగారం బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా గీకురు భాగ్యలక్ష్మి ఎంపిక అయ్యారు కావున వారు ఇట్టి సమావేశానికి తప్పకుండా రాగలరు. అలాగే ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖా మాత్యులు దనసరి అనసూయ సీతక్క ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ములుగు జిల్లా మహిళా కాంగ్రెస్ ఇంచార్జీలు ఆంగోత్ సుగుణ గారు మరియు పింగళి జ్యోతి రెడ్డి విచ్చేస్తున్నారు. కావున ములుగు జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకులు అందరూ అన్ని మండలాల నుండి భారీగా తరలి వచ్చి మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుకుంటున్నారు.

# 60000/- రూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**నర్సంపేట తెలంగాణ సేన :** నర్సంపేట నియోజకవర్గం స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు నర్సంపేట మున్సిపాలిటీ 1వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి లక్కర్స్ రమేష్ చిన్నెట్టి శ్వేత వాళ్ళ పాప అనారోగ్య కారణంగా 60000/- రూ . సీఎంరిలీఫ్ ఫండ్ చెక్ అంద జేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొల్లపెల్లి కిష్టయ్య శ్రీరామ్ శెట్టి రాజు బిట్ల మనోహర్ చిలువేరు కమలాకర్ మేక వెంకన్న మల్లేశం ఎరుకల రమేష్ బత్తుల శివకృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ యువకుడికి జాతీయస్థాయి గ్రేట్ పీపుల్ మేనేజర్స్ అవార్డు ప్రధానం







**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి మే 25 :** హుజురాబాద్ పట్టణానికి చెందిన శ్రీ లక్ష్మీ ఫిల్లింగ్ స్టేషన్ యజమాని ఆడెపు సూర్యం సంధ్యారాణి దంపతుల కుమారుడు ఆడెపు ధీరజ్ జాతీయస్థాయి గ్రేట్ పీపుల్ మేనేజర్స్ అవార్డు ముంబైలో అందుకున్నారు. భారతదేశవ్యాప్తంగా టాప్ 100 గ్రేట్ పీపుల్ మేనేజర్స్ ఆఫ్ ఇండియా సెలెక్ట్ చేయగా అందులో నుండి హుజురాబాద్ కు చెందిన ఆడెపు ధీరజ్ ఎంపిక కాగా రెండు రోజుల క్రితం ముంబాయిలో నిర్వహించిన జిఎంఐ సమ్మిట్ లో గ్రేట్ మేనేజర్ ఇన్స్టిట్యూట్ ఇన్ గ్రేట్ మేనేజర్స్ లీగ్ సమ్మేటివ్ 2025 ఇన్ టాటా థియేటర్ ఎన్సిపిఎ లో ఆయనకు అవార్డును, సర్టిఫికెట్ ను అందజేశారు. దేశంలోనే వందమంది వ్యాపారవేత్తలలో హుజురాబాద్ కు చెందిన ధీరజ్ ఎంపిక కావడం జిల్లాకే కాదు తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం అని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనకు మిత్రులు, శ్రేయోభిలాషులు, వ్యాపారులు అభినందనలు తెలిపారు.

# 27న ఇంద్రపార్క్ వద్ద నిరాహార దీక్షను విజయవంతం చేయండి...

## తెలంగాణ ఉద్యమకారుడు మంతూరి ఆంజనేయులు...



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా : తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపులో భాగంగా 27వ తేదీ రోజున ఒకరోజు నిరాహార దీక్షను తెలంగాణ ఉద్యమకారులు ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు అంబేద్కర్ పూలే మహాజన సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మంతూరి ఆంజనేయులు అన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తామని తన మేనిఫెస్టో లో పెట్టుకొని ఇప్పటివరకు కూడా ఉద్యమకారులకు న్యాయం చెయ్యలేదని న్యాయం చేయడంలో విఫలం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అయిందని ఆంజనేయులు అన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లను పరిశీలించి ఇచ్చిన హామీలను ఇచ్చిన మాటను అమలు చేయాలని. తెలంగాణ ఉద్యమకారుడు. అంబేద్కర్ పూలే మహాజన సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మంతూరి ఆంజనేయులు అన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని లక్ష్యంతో తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ.ఆధ్వర్యంలో ఇంద్రపార్క్ వద్ద ఒక్కరోజు దీక్షను పిలుపునివ్వడం జరిగింది. కావునా తెలంగాణ మలిదశ ఉద్యమకారులు తొలిదశ ఉద్యమకారులు విద్యార్థులు మేధావులు మహిళలు కవులు కళాకారులు పాల్గొని. ఒక్కరోజు దీక్షను విజయవంతం చేయాలని కోరారు.. శాంతియుతంగా తెలంగాణ ఉద్యమకారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్నోసార్లు మొరపెట్టుకున్నప్పటికీ ప్రభుత్వానికి కనువిప్పు కావడం లేదని మండిపడ్డారు ప్రత్యేక రాష్ట్రం కోసం సాగరహారం. సకలజనుల సమ్మె. రైల్ రోకో..వంటవార్పు.. బోనాలు బతుకమ్మలతో ధర్నాలు.. పోరాటాలు ఇచ్చినటువంటి ఘనత ఉద్యమకారులకు ఉంది అని మర్చిపోవద్దని అన్నారు ఉస్మానియా గడ్డపై ఉద్యమాలు చేస్తున్న క్రమంలో ఎన్నో ఆటుపోట్లకు ఎదురొడ్డి ఎంతోమంది విద్యార్థులు యువకులు మహిళలు ప్రాణ త్యాగాల వల్ల వచ్చిన తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించినటువంటి ఉద్యమకారులని గుర్తించకుండా ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల ముందు తమ పార్టీ మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులను గుర్తిస్తామని నమ్మ బలికినటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికి కూడా ఉద్యమకారులను గుర్తించడంలో విఫలమైందని ఆంజనేయులు అన్నారు.. ఇప్పటికైనా తెలంగాణ ఉద్యమకారులని గుర్తించి తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని వారు కోరారు లేని పక్షంలో తెలంగాణ ఉద్యమం కోసం బరగిసి కొట్లాడినటు పంటి ఉద్యమ స్ఫూర్తితో మరో ఉద్యమం మొదలు పెట్టాల్సిన అవసరం వస్తుందని అంబేద్కర్ పూలే మహాజన సంఘం వ్యవస్థాపక జాతియా అధ్యక్షులు తెలంగాణ ఉద్యమకారుడు మంతూరి ఆంజనేయులు ప్రభుత్వాని డిమాండ్ చేశారు..

# సీనియర్ జర్నలిస్ట్ ఎండి మునీర్ మృతి తీరని లోటు

## టి యు డబ్ల్యు జే ఐ జే యు జిల్లా అధ్యక్షులు కొండూరు రవీందర్, ప్రధాన కార్యదర్శి వెంక గారి భూమయ్య.



**నిర్మల్ / మే 25 ( తెలంగాణసేన న్యూస్ ) జిల్లా ప్రతినిధి :** ఉద్యమకారుడు సీనియర్ జర్నలిస్ట్ ఎండి మునీర్ మృతిపట్ల తీవ్రదిగ్రాంతిని వ్యక్తిం చేసిన నిర్మల్ జిల్లా టి యు డబుల్ జే ఐ జే యు జిల్లా అధ్యక్షులు కొండూరు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంక గారి భూమయ్య ప్రకటన విడుదల ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు నాలుగు దశాబ్దాల పాటు జర్నలిస్టుగా, ప్రజా ఉద్యమకారుడిగా, సింగరేణి కార్మికులకు నాయకునిగా, తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ నాయకుడిగా మునీర్ పనిచేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్రపోషించాడు. ఆయన మరణం జర్నలిస్టు కమ్యూనిటీకి తీరని లోటు. మునీర్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

# విద్యుత్ షాక్ తో నాలుగు గేదెల మృతి



**లోకేశ్వరం /మే 25/తెలంగాణ సేన న్యూస్ :** మండలంలోని గోడి సెరా గ్రామంలోని విద్యుత్ షాక్ తో నాలుగు గేదలు మృతి చెందాయి గ్రామంలోని పెద్దలు మరియు విద్యుత్ షాక్ గురైన బాధితులు మాట్లాడుతూ శుక్రవారం రోజున గేదెలు మేతకు వెళ్లాయని తిరిగి ఆదివారం రోజు చూడగా 4 గేదెలు మృతి చెందాయని విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు మృతి చెందిన గేదెల్లో ఎల్లన్న ఒకటి మల్లేష్ ఒకటి భూమన్నవి రెండు గేదలు మృతి చెందాయి ఒక్కో దాని విలువ లక్ష పదివేలు 110000. ఉన్నవి అని అధికారులు నాయకులు స్పందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని తెలియజేశారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణి చేసిన నాయకులు



**నర్సంపేట తెలంగాణ సేన :** నర్సంపేట మున్సిపల్ పరిధిలోని 14వ వార్డు లో. సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేసిన నాయకులు నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ఆదేశాల అనుసారం నర్సంపేట 14వ వార్డులోని. వెలదండి సరోజన కి సీఎం ఆర్ ఎఫ్ చెక్కును అందించిన. మాజీ కౌన్సిలర్ ఎలకంటి విజయ్ కుమార్ నర్సంపేట నియోజకవర్గ మైనార్టీ కన్వీనర్ ఎండి బాబా శ్రీరామోజు మురళి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో గేదె మృతి


**ముధోల్/ మే 25/ తెలంగాణ సేన న్యూస్ :** ముధోల్: ముధోల్ మండలంలోని వడ్తల గ్రామానికి చెందిన దేవ్ రావు పటేల్ గేదె విద్యుత్ షాక్తో ఆదివారం మృతి చెందింది. గ్రామ శివారులోని వద్ద మేత మేస్తుండడంతో ప్రమాదవశాస్తు ట్రాన్స్ ఫార్మర్ ఎర్త్ వైర్ను తగలడంతో అక్కడికక్కడే మరణించింది. గేదె విలువ సుమారు రూ.80వేల వరకు ఉంటుందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులడు కోరుతున్నారు.

# అలంపూర్ వాసవి నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడు చిలుకూరి రమేష్ కు ఘన సన్మానం



**గద్వాల్, తెలంగాణ సేన :** జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ శ్రీ వాసవి నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడిగా గెలుపొందిన చిలుకూరి రమేష్ గుప్తాను సన్మానించిన గజ్వేల్ వైశ్య నాయకులు తోట బిక్షపతి ఆదిమూలం నారాయణ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జోగులాంబ అలంపూర్ శ్రీ వాసవి నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుని కోసం నిర్వహించిన ఎన్నికల్లో పాల్గొని ఓటు వేయడం జరిగిందని హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో చిలుకూరి రమేష్ గుప్తా ఘనవిజయం సాధించారని వారిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేయడం జరిగిందని అన్నారు.

# దిలాల్ పూర్ లో రైతులకు అవగాహన సదస్సు




**తెలంగాణ సేన :** అంకుర్ సీడ్స్ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం దిలాల్పూర్ గ్రామంలో గజ్వేల్, దౌల్తాబాద్, జగదేవపూర్, రాయపోల్, పలు మండలాల నుండి దాదాపు 30 గ్రామాల రైతులను ఆహ్వానించి రైతు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో 500 రైతులు పాల్గొనడం జరిగింది ఈ సమావేశంలో అంకూర్ సీడ్స్ రీజనల్ మేనేజర్ బివిఎస్ఎన్ హరివర్మ మాట్లాడుతూ అంకూర్ సీడ్స్ వారి శుభం అనే పత్తి రకం అన్ని నేలలకు కు అనుకూలమైనది అలాగే ఇది అన్ని పత్తి రకాల కన్నా తొందరగా వచ్చి రెండో పంట కూడా వేసుకోవడానికి అనుకూలమైనది మరియు దీని కాయ సైజు పెద్దగా ఉండి పత్తి తీయడానికి కూలీలకు అనువుగా ఉండును మరియు దీనిలో గింజ లో నూనె శాతం ఎక్కువగా ఉండి అధిక బరువు ఉండును అలాగే ఇది చీడపీడలను తట్టుకొనును అందుకే రైతులందరూ అంకుర్ శుభం పత్తి రకం నాటుకొని అధిక దిగుబడులు పొందవలసినదిగా కోరినారు ఈ కార్యక్రమంలో ఏరియా మేనేజర్ రోళ్ల శ్రీకాంత్, డిస్ట్రిబ్యూటర్ గోలి సంతోష్ కుమార్, అంకూరు సీడ్స్ గజ్వేల్ ప్రతినిధి అరవింద్,వివిధ జిల్లాల ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలోని డల్లాస్ నగరంలో జూన్ 1వ తేదీన జరిగే బిఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్ది సుదర్శన్ రెడ్డి



**నర్సంపేట తెలంగాణ సేన :** బిఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల రజతోత్సవ సభను జూన్ 1న అమెరికా డల్లాస్ రాష్ట్రంలో నిర్వహించినున్నా సందర్భంగా నర్సంపేట మాజీ శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి అమెరికాలో ఈ సభకు హాజరుకానున్నారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా వరంగల్ జిల్లాలో లక్షలాది మందితో నిర్వహించిన రజతోత్సవ సభ విజయవంతంలో కీలక పాత్ర పోషించిన పెద్ది సుదర్శన్ రెడ్డి. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రివర్యులు బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు మాజీ మంత్రివర్యులు హరీష్ రావు మన్ననలు పొందిన పెద్ది సుదర్శన్ రెడ్డి అమెరికా డల్లాస్ నగరం లో నిర్వహించినున్న పార్టీ రజతోత్సవ సభ వేడుకలలో పాల్గొన నున్నారు. బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుండి ఉద్యమకారుడిగా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా,నాయకునిగా కెసిఆర్ సైనికుడిగా 25 సంవత్సరాలు పార్టీలో పని చేయడం తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగస్వామిగా ఉండడం గర్వంగా ఉంది అన్నారు, నేడు అమెరికాలో జరిగే రజతోత్సవ సభలో పాలు పంచుకోవడం సంతోషంగా ఉంది అన్నారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన కుంజ సూర్య రామ్



**గంగారం తెలంగాణ సేన :** ఈ రోజు గంగారం మండలం కోడిశలమిట్ట గ్రామంలో ఈసాల సారయ్య-పద్మ దంపతుల కనిష్ట పుత్రుడు వంశి-యశస్విని (ఐశ్వర్య) నూతన దంపతులను ఆశీర్వదించిన శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ స్టేట్ జనరల్ సెక్రెటరీ కుంజ సూర్యరామ్ మరియు గంగారం మండల కాంగ్రెస్ పార్టీ యుత్ అధ్యక్షులు ముడిగ విజెయ్ కుమార్ అనంతరం వీటి మధ్య కాలంలో అడవి దున్నతో గాయపడిన గుంట సూర్యకాంత్ ను పరామర్శించి ప్రథమ చికిత్సకు ఆర్థిక సాయం అందించి మనోధైర్యం చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో గంగారం మండల కాంగ్రెస్ పార్టీ యుత్ అధ్యక్షులు ముడిగ విజెయ్ కుమార్ గంగారం మండల మాజీ జెడ్పిటిసి ఈసం రమ సురేష్ గంగారం మాజీ ఎంపిటిసి పూనెం భద్రక్క ప్రభాకర్ అన్న యూత్ కాంగ్రెస్ నాయకులు పులసం సురేష్ జజ్జెరి సాంబయ్య వజ్జ సారయ్య మాజీ ఉపసర్పంచ్ బావూరుకొండ ఈక రవికుమార్ అక్క పెల్లి సాంబయ్య జనగం కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# అనాథలు, నిరాశ్రయుల కోసం 277వ అన్నదాన కార్యక్రమము



**సికింద్రాబాద్, తెలంగాణ సీనియర్ న్యూస్ :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో వాహనంలో వాహనంలో సంచరిస్తూ ఆకలితో ఉన్న అనాథలు, నిరాశ్రయులు, సంచార జాతుల వారిని గుర్తించి 277వ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించాము. ఈ అన్నదాన కార్యక్రమములో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని.ఓ, సేవాసభ్యులు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కరిగిపోతున్న విదేశీ నిల్వలు



విదేశీ నిల్వలు క్రమంగా కరిగిపోతున్నాయి. గత నెల చివరినాటికి భారత్‌లో విదేశీ మారకం నిల్వలు 4.112 బిలియన్ డాలర్లు తరిగిపోయి 640.279 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంక్ తన వారాంతపు సమీక్షలో వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 8.478 బిలియన్ డాలర్లు తగ్గి 644.391 బిలియన్ డాలర్లకు పడిపోయిన విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలోవున్న ఆస్తుల విలువ 4.641 బిలియన్ డాలర్లు తగ్గి 551.921 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. కానీ, పసిడి రిజర్వులు మాత్రం 541 మిలియన్ డాలర్లు ఎగబాకి 66.268 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

# వీఐ వార్షిక ప్లాన్‌లో అన్‌లిమిటెడ్ డాటా



ప్రముఖ టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా(వీఐ) తన కస్టమర్లకు శుభవార్తను అందించింది. వార్షిక రీచార్జి ప్లాన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ప్లాన్ల కింద అన్‌లిమిటెడ్ డాటాను అర్ధరాత్రి నుంచి మధ్యాహ్నం వరకు అందుకోవచ్చునని తెలిపింది. రూ. 3,599, రూ.3,699, రూ.3,799 ప్రీ-పెయిడ్ ప్లాన్లలో అర్ధరాత్రి 12 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు అన్‌లిమిటెడ్ డాటాతోపాటు మిగతా సమయంలో రోజువారి 2జీబీ డాటాను కూడా పొందవచ్చునని తెలిపింది. ఈ ప్రత్యేక ప్యాక్‌లు మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు, కేరళ, బెంగాల్, పంజాబ్, హార్యానా సర్కిళ్లలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు, సమీప భవిష్యత్తులో మిగతా సర్కిళ్లలో కూడా ఈ ప్లాన్‌ను ప్రవేశపెట్టనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

# స్టాక్ మార్కెట్లలో అదరగొట్టిన డీమార్ట్ 11 శాతం లాభంతో ముగిసిన షేర్..!



డీ-మార్ట్ పేరుతో రిటైల్ చైన్ నెట్‌వర్క్ నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్ మార్కెట్స్ శుక్రవారం స్టాక్ మార్కెట్లలో అదరగొట్టింది. 2024 డిసెంబర్ నెలతో ముగిసిన త్రైమాసికంలో స్టాండలోన్ ఆదాయం 17.5 శాతం సాధించినట్లు రిపోర్ట్ చేయడంతో డీ-మార్ట్ షేర్ 11 శాతానికి పైగా పెరిగింది. బీఎస్ఈ సెన్సెక్స్‌లో డీ-మార్ట్ షేర్ రూ.4,023.25ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్ లో 15.12 శాతం వృద్ధితో రూ.4,165 వరకూ దూసుకెళ్లింది. మరోవైపు ఎన్ఎస్ఈలోనూ 11 శాతం లబ్ధి పొంది రూ.4,011.90 వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 15.36శాతం పుంజుకుని రూ.4,165.90 వరకూ దూసుకెళ్లింది. బీఎస్ఈలో డీ-మార్ట్ షేర్లు 6.82 లక్షల షేర్లు, ఎన్ఎస్ఈలో 92.84 లక్షల షేర్లు ట్రేడయ్యాయి. 2024 డిసెంబర్ నెలాఖరుతో ముగిసిన త్రైమాసికంలో డీ-మార్ట్ 17.5 శాతం వృద్ధితో రూ.15,565.23 కోట్ల స్టాండలోన్ రెవెన్యూ సంపాదించింది. ఏడాది క్రితం 2023 డిసెంబర్ త్రైమాసికంలో రూ.13,247.33 కోట్ల ఆదాయం సముపార్జించింది. దేశవ్యాప్తంగా 387 డీ-మార్ట్ షేర్లు ఉన్నాయని అవెన్యూ సూపర్ మార్ట్స్ శుక్రవారం బీఎస్ఈ ఫైలింగ్‌లో తెలిపింది. డీ-మార్ట్‌లో బేసిక్, గృహ వినియోగ వస్తువులు, పర్సనల్ కేర్ వస్తువులు విక్రయిస్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ-ఎన్సీఆర్, తమిళనాడు, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో డీ-మార్ట్ స్టోర్లు విస్తరించి ఉన్నాయి. దీనికి రాధాకిషన్ దమానీ కుటుంబం ప్రమోటర్‌గా ఉంది.

# న్యూ ఇయర్ ఆఫర్.. ఈ కార్లపై హోండా డిస్కౌంట్ గరిష్టంగా రూ.90 వేల వరకూ ధర తగ్గింపు..!



ప్రముఖ కార్ల తయారీ సంస్థ హోండా కార్స్ నూతన సంవత్సర ఆఫర్ కింద తమ ఫ్లాగ్‌షిప్ కార్లపై భారీ డిస్కౌంట్లు ప్రకటించింది. జనవరి నుంచి ధరలు పెంచుతున్నట్లు ఇంతకుముందే వెల్లడించిన సంగతి తెలిసిందే. హోండా ఎలివేట్ ఎస్‌యూవీ, హోండా సిటీ, హోండా హైబ్రీడ్ సెడాన్ కార్లపై రాయితీలు ప్రకటించింది. గరిష్టంగా రూ.90 వేల వరకూ డిస్కౌంట్‌లు ఆఫర్ చేసింది. ఈ నెలాఖరు వరకూ డిస్కౌంట్లు వర్తిస్తాయి. గత నెలలో మార్కెట్లో ఆవిష్కరించిన న్యూ జనరేషన్ అమేజ్ సబ్ కంపాక్ట్ సెడాన్ కారుపై డిస్కౌంట్ లేదు. కానీ పాత మోడల్ హోండా అమేజ్ మీద డిస్కౌంట్ కొనసాగుతుంది. ఈ నెల ఒకటో తేదీ నుంచి తన కార్లపై రెండు శాతం ధరలు పెంచుతామని ఇంతకు ముందే హోండా కార్స్ ప్రకటించింది. ధరల పెంపును అధికారికంగా వెల్లడించలేదు. హోండా ఎలివేట్, హోండా సిటీ, హోండా సిటీ హైబ్రీడ్ కార్లపై ధర పెరుగనున్నది. హోండా సిటీ హైబ్రీడ్ సెడాన్ కారుపై గరిష్టంగా డిస్కౌంట్ అందిస్తోంది. క్యాష్ డిస్కౌంట్, లాయల్టీ, ఎక్స్ఛేంజ్ బెనిఫిట్ తదితర రూపాల్లో రూ.90 వేల వరకూ డిస్కౌంట్ లభిస్తుంది. స్కోడా స్లావియా, ఫోక్స్‌వ్యాగన్ విర్టస్, హ్యుండాయ్ వెర్నాలతో పోటీ పడుతున్న ఫిఫ్త్ జనరేషన్ సిటీ కారుపై రూ.73,300 డిస్కౌంట్ ఆఫర్ చేస్తోంది. హోండా తన కంపాక్ట్ ఎస్‌యూవీ ఎలివేట్ కారు మీద రూ.86,000 డిస్కౌంట్ అందిస్తుంది. హ్యుండాయ్ క్రెటా, కియా సెల్టోస్, మారుతి సుజుకి గ్రాండ్ విటారా మోడల్ కార్లకు ఎలివేట్ పోటీనిస్తుంది. ఈ డిస్కౌంట్‌లో క్యాష్ డిస్కౌంట్, లాయల్టీ బెనిఫిట్ తదితరాలు ఉన్నాయి. ఇటీవల ఆవిష్కరించిన ఎలివేట్ అపెక్స్ ఎడిషన్ కారుపై రూ.45,000 డిస్కౌంట్ అందిస్తోంది. ఈ నెలాఖరులో ఎలివేట్ న్యూ బ్లాక్ ఎడిషన్ కారు ఆవిష్కరించనున్నది.

# రెండేండ్ల తర్వాత.. వడ్డీరేట్ల కోతకు వేళాయె!

## రాబోయే ద్రవ్యసమీక్షల్లో కీలక వడ్డీరేట్ల తగ్గింపునకు అవకాశం

## జూన్‌కల్లా రెపోరేటు అర శాతం తగ్గొచ్చన్న అంచనాలు



ఈ ఏడాది ప్రథమార్ధం (జనవరి-జూన్)లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను తగ్గించే వీలుందన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయిప్పుడు. దీంతో రాబోయే మూడు ద్రవ్యసమీక్షలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి. జూన్‌కల్లా రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు (అర శాతం) తగ్గవచ్చని అమెరికాకు చెందిన బహుళజాతి ఆర్థిక సేవల సంస్థ జెఫ్రీస్ చెప్తున్నది. దీంతో ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్ నెలల్లో ఆర్బీఐ జరిపే ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలపైనే ఇప్పుడు అందరి దృష్టీ నెలకొంటున్నది.

### రెండేండ్ల తర్వాత..

దాదాపు రెండేండ్లుగా రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్లను ఆర్బీఐ యథతథంగానే ఉంచుతున్నది. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా వడ్డీరేట్లను సెంట్రల్ బ్యాంక్ సవరించింది. రెపోరేటును గరిష్ఠంగా 6.5 శాతానికి తీసుకెళ్లింది. ఇక అప్పట్నుంచి అది అక్కడే ఉంటున్నది. కరోనా సమయంలో దిగాలుపడిన దేశ జీడీపీని ఉత్సాహపర్చేందుకు వడ్డీరేట్లను బాగా తగ్గించిన ఆర్బీఐ.. ఆ తర్వాత ద్రవ్యోల్బణం అదుపునకు అంతే స్థాయిలో పెంచుకుంటూపోయింది. ఇప్పటికీ ద్రవ్యోల్బణం గణాంకాలు ఆర్బీఐ ఆమోదయోగ్య స్థాయిని మించే నమోదవుతుండటంతో వరుస ద్రవ్యసమీక్షలను వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ముగిస్తూ వచ్చేశారు. అయితే ఇప్పుడు వడ్డీరేట్ల కోతకు వేళైందన్న అభిప్రాయాలు అంతటా వినిపిస్తున్నాయి. పైగా ఆర్బీఐకి కొత్త గవర్నర్‌గా శక్తికాంత దాస్ స్థానంలో సంజయ్ మల్హోత్రా రావడం, ఫిబ్రవరి ద్రవ్యసమీక్ష ఆయన ఆధ్వర్యంలోనే జరుగుతుండటం కూడా ఈసారి మీటింగ్‌పై సహజంగానే అంచనాలు పెరిగాయి.

### సంకేతాలకు తగ్గట్టుగానే..

గత నెల డిసెంబర్‌లో నిర్వహించిన ద్రవ్యసమీక్షలోనే దాస్.. ఆర్బీఐ ఇన్నాళ్లూ అవలంభిస్తూ వస్తున్న కఠిన ద్రవ్య వైఖరికి గుడ్‌బై చెప్పిందన్న సంకేతాలిచ్చారు. ఇకపై న్యూట్రల్ పాలసీ ఉంటుందని ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో ద్రవ్యోల్బణం, జీడీపీల ఆధారంగా వడ్డీరేట్ల పెంపు, తగ్గింపులుంటాయని స్పష్టం చేశారు. అయితే ఇప్పటికే వడ్డీరేట్లు గరిష్ఠ స్థాయిల్లోనే ఉండటంతో ఇక తగ్గింపు తప్ప, పెంపునకు ఆస్కారం లేదన్న వాదనలున్నాయి. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో కోతలేనన్న అంచనాల్ని వేస్తున్నారు. అదీగాక నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని 50 బేసిస్ పాయింట్లు గత సమీక్షలోనే తగ్గించారు. ఫలితంగా ఈసారి రెపోరేటు కోతలుండవచ్చని అంటున్నారు.

### ఆటో, రియల్టీ ఒత్తిళ్లు

వడ్డీరేట్లను తగ్గించాలని వాహన, నిర్మాణ రంగాల నుంచి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిళ్లు గతకొంతకాలంగా పెరుగుతున్నాయి. ఈఎంఐల భారంతో రుణగ్రహీతలు, అధిక వడ్డీల భయంతో కొనుగోలుదారులు ఆందోళనలో ఉన్నారని ఆయా రంగాలు చెప్తున్నాయి. ఇక దేశ జీడీపీ వృద్ధిరేటుపై అనుమానాలు పెరుగుతున్న నేపథ్యంలో వడ్డీరేట్లు తగ్గితే ఆయా రంగాలను ప్రోత్సహించినట్టు అవుతుందని ప్రభుత్వ పెద్దలు సైతం భావిస్తున్నారు. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్ల కోతలకే వీలుందన్న అభిప్రాయాలున్నాయి. పైగా ఇబ్బందుల్లో ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)ల వృద్ధికీ వడ్డీరేట్లు కలిసొస్తాయని చెప్తున్నారు. మొత్తానికి కొత్త గవర్నర్ అధ్యక్షతన కూర్చునే ద్రవ్య విధాన కమిటీ ఏం నిర్ణయిస్తుందోనన్న టెన్షన్ నెలకొన్నది.

# ఎస్బీఐ సరికొత్త డిపాజిట్లు



## హర్ ఘర్ లఖ్‌పతి, ప్యాట్రాన్స్ ప్రారంభం

డిపాజిట్‌దారులను ఆకర్షించేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) రెండు సరికొత్త డిపాజిట్ పథకాలను పరిచయం చేసింది. హర్ ఘర్ లఖ్‌పతి, ప్యాట్రాన్స్ పేరిట వీటిని ప్రారంభించినట్టు శుక్రవారం బ్యాంక్ ప్రకటించింది. ఖాతాదారుల ఆర్థిక అవసరాలు ఇంకా సౌకర్యవంతంగా తీరేలా, మరింత విలువతో ఈ నయా స్కీములను రూపొందించింది.

### హర్ ఘర్ లఖ్‌పతి

ఇదో ప్రీ-కాలిక్యులేటెడ్ రికరింగ్ డిపాజిట్ పథకం. లక్ష రూపాయలు, ఆపై మొత్తాలను కస్టమర్లకు అందించేలా ఈ స్కీమును డిజైన్ చేసినట్టు ఓ ప్రకటనలో ఎస్బీఐ స్పష్టం చేసింది. ఈ డిపాజిట్‌తో కస్టమర్ల ఆర్థిక లక్ష్యాలు సులభంగా తీరుతాయని, ఆర్థిక ప్రణాళిక-పొదుపు మరింత ప్రభావవంతంగా ఉంటాయన్నది. ఎఫ్‌డీపై అమల్లో ఉన్న వడ్డీరేట్లే దీనికీ ఉంటాయి. ప్రస్తుతం ఏడాదికిపైగా కాలపరిమితి కలిగిన ఎఫ్‌డీలపై 6.80 శాతం, రెండేండ్లకుపైగా కాలపరిమితి ఎఫ్‌డీపై 7 శాతం, 3-5 ఏండ్ల ఎఫ్‌డీలపై 6.75 శాతం, 5-10 ఏండ్ల ఎఫ్‌డీలపై 6.5 శాతం వడ్డీరేట్లున్నాయి. రికరింగ్ డిపాజిట్ల కనీస కాలపరిమితి సంవత్సరం. గరిష్ఠం 10 ఏండ్లు.

### ప్యాట్రాన్స్‌జి

80 ఏండ్లు, ఆపై వయసు కలిగినవారి కోసం ఈ పథకాన్ని ఎస్బీఐ ప్రత్యేకంగా తీసుకొచ్చింది. ఇందులో సీనియర్ సిటిజన్లకు మరింత వడ్డీరేటు లభిస్తుంది. అదనంగా మరో 10 బేసిస్ పాయింట్ల వడ్డీరేటు వర్తిస్తుంది. ప్రస్తుత, కొత్త టర్మ్ డిపాజిట్ కస్టమర్లకు ఈ పథకం అందుబాటులో ఉంటుందని ఎస్బీఐ తెలియజేసింది. ముఖ్యంగా ఎప్పట్నుంచో బ్యాంక్‌తో అనుబంధాన్ని కొనసాగిస్తున్న వృద్ధులకు లాభం చేకూర్చాలనే దీన్ని రూపొందించామని పేర్కొన్నది. కాగా, డిపాజిట్లలో ఎస్బీఐ మార్కెట్ వాటా 23 శాతంగా ఉన్నది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రకటించిన ఈ రెండు డిపాజిట్లతో మార్కెట్‌లో మరింత వాటాను అందిపుచ్చుకుంటామన్న ఆశాభావాన్ని ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి వ్యక్తం చేశారు. ఇదిలావుంటే ఎన్ఆర్ఈ, ఎన్ఆర్వో ఖాతాలను తెరిచేందుకు ఎన్నారైల కోసం ఓ ట్యాబ్ ఆధారిత ఎండ్-టు-ఎండ్ డిజిటల్ ఆన్-బోర్డింగ్ ప్రక్రియను ఎస్బీఐ ప్రకటించింది. దేశంలోని అన్ని ఎస్బీఐ శాఖల్లో, ఎంపిక చేసిన కొన్ని విదేశీ కార్యాలయాల్లో ఇది అందుబాటులో ఉంటుందని వివరించింది.

# ఫిబ్రవరి ఒకటో తేదీన కియా సిరోస్ ఆవిష్కరణ ప్రీ బుకింగ్స్ ప్రారంభం

ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా ఇండియా భారత్ మార్కెట్‌లో త్వరలో కంపాక్ట్ ఎస్‌యూవీ కియా సిరోస్ కారు ఆవిష్కరించనున్నది. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి కియా సిరోస్ కార్ల బుకింగ్స్ ప్రారంభం అయ్యాయి. ఆసక్తి గల కస్టమర్లు ఆన్‌లైన్‌లో గానీ, డీలర్‌షిప్‌ల వద్ద గానీ రూ.25,000 చెల్లించి బుక్ చేసుకోవచ్చు. ఫిబ్రవరి ఒకటో తేదీన భారత్ మార్కెట్‌లో కియా సిరోస్ కారు ఆవిష్కరిస్తారు. ఫిబ్రవరి రెండో వారం నుంచి డెలివరీ ప్రారంభం అవుతాయి. కియా కార్నివాల్, కియా ఈవీ3, కియా ఈవీ9 కార్ల నుంచి స్ఫూర్తిగా తీసుకుని కియా సిరోస్ కారును డిజైన్ చేశారు. బంపర్ ఎడ్జ్ మీద స్టాక్డ్ ఎల్ఈడీ హెడ్ ల్యాంప్స్, త్రీ ఎల్ఈడీ ప్రొజెక్టర్ యూనిట్లు, డిస్టింక్టివ్ డ్రాప్ డౌన్ ఎల్ఈడీ డే టైమ్ రన్నింగ్ లైట్, సిల్వర్ అసెంటెడ్ బ్లాక్ ట్రిమ్ ఉంటాయి. ఏ-,సీ-, డీ పిల్లర్స్ విత్ బాడీ కలర్డ్ బీ-పిల్లర్స్, క్లీన్ విండో లైన్, ఫ్లష్ ఫిటింగ్ డోర్ హ్యాండిల్స్, వీల్ ఆర్చ్ క్లాడింగ్, 17- అంగుళాల 3-పెటల్ అల్లాయ్ వీల్స్, యునిక్ రేర్ విండో కింక్, రేర్‌లో హై మౌంటెడ్ ఎల్-షేప్డ్ టెయిల్ ల్యాంప్స్, టూ టోన్ రేర్ బంపర్ వంటి ఫీచర్లు ఉంటాయి. కియా సిరోస్ కారులో ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌తోపాటు రీడిజైన్డ్ డాష్ బోర్డ్ విత్ డ్యుయల్ 12.3 అంగుళాల డిస్ ప్లే, ఫోమింగ్ 30- అంగుళాల యూనిట్, టూ స్పోక్ స్టీరింగ్ వీల్, వైర్‌లెస్ చార్జింగ్ పాడ్, అంబియెంట్ లైటింగ్, ఫిజికల్ హెచ్‌వాక్ స్విచ్చెస్, ఏసీ వెంట్స్, హారిజొంటల్ డిజైన్ లైన్స్ తదితర ఫీచర్లు కూడా జత చేశారు. ఈ కారు ధర రూ.9.70 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి రూ.16.70 లక్షల (ఎక్స్ షోరూమ్) వరకూ పలుకుతుందని భావిస్తున్నారు. హ్యుండాయ్ క్రెటా, మారుతి సుజుకి గ్రాండ్ విటారా, సబ్ కంపాక్ట్ ఎస్‌యూవీలు టాటా నెక్సాన్, కియా సోనెట్, మారుతి బ్రెజా కార్లతో కియా సిరోస్ కారు పోటీ పడుతుంది. కియా సిరోస్ కారు రెండు ఇంజిన్ చాయిస్‌ల్లో లభిస్తుంది. ఒకటి 1.0 లీటర్ల 3-సిలిండర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో వస్తోంది. ఈ ఇంజిన్ గరిష్టంగా 120 హెచ్పీ విద్యుత్, 172 ఎన్ఎం టార్క్



వెలువరించడంతోపాటు 6-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ లేదా 7-స్పీడ్ డీసీటీ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది. 1.5 లీటర్ల 4 సిలిండర్ టర్బో డీజిల్ ఇంజిన్‌తో వస్తోంది. ఈ ఇంజిన్ గరిష్టంగా 115హెచ్పీ విద్యుత్, 250ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. ఈ ఇంజిన్ 6-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, టార్క్ కన్వర్టర్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లలో లభిస్తుంది. వెన్యూ, క్రెటా, సొనెట్ తదితర మోడల్ కార్లలో ఈ ఇంజిన్లను హ్యుండాయ్, కియా వినియోగిస్తున్నాయి.

# తొలివారం నష్టాలతో ముగిసిన స్టాక్స్ 24 వేల ఎగువన నిఫ్టీ సెన్సెక్స్ 720 పాయింట్లు లాస్



దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ 720.60 పాయింట్ల నష్టంతో 79,223.11 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 80,072 పాయింట్ల గరిష్ట స్థాయి నుంచి 79,147.32 పాయింట్ల కనిష్ట స్థాయి వరకూ సాగింది. మరోవైపు, ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ 183.90 పాయింట్లు కోల్పోయి 24,004.75 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్‌లో 24,196.45 పాయింట్ల గరిష్ట స్థాయికి దూసుకెళ్లి, 23,978.15 పాయింట్ల కనిష్ట స్థాయికి పడిపోయింది. బీఎస్ఈ-30 సెన్సెక్స్ లో జోమాటో, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టీసీఎస్ షేర్లు భారీగా నష్టపోయాయి. టాటా మోటార్స్, టైటాన్, నెస్లే ఇండియా, హిందూస్థాన్ యూనీ లివర్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభ పడ్డాయి. గ్లోబల్ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ 75.61 డాలర్లు పలికితే, ఔన్స్ బంగారం 2670 డాలర్ల వద్ద ట్రేడయింది. బ్యాంకింగ్, ఫైనాన్సియల్, ఐటీ స్టాక్స్ మీద అమ్మకాల ఒత్తిడితో సూచీలు పతనం అయ్యాయి. హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్ తదితర బ్లూచిప్ కంపెనీల షేర్లపై ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు ప్రాధాన్యం ఇచ్చారు. ఎన్ఎస్ఈ-50 నిఫ్టీలో 32 స్టాక్స్ నష్టాల్లోనే ముగిశాయి. విప్రో, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, సిప్లా వంటి స్టాక్స్ 2.83 శాతం వరకూ నష్టపోయాయి. మరోవైపు, ఓఎన్జీసీ, టాటా మోటార్స్, టైటాన్, నెస్లే ఇండియా, ఎస్బీఐ లైఫ్ తదితర 18 స్టాక్స్ 5.11 శాతం వరకూ లాభ పడ్డాయి. బ్రాడర్ మార్కెట్లు %-% నిఫ్టీ మిడ్ క్యాప్-100 సూచీ 0.30 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్-100 సూచీ 0.24 శాతం నష్టాలతో ముగిశాయి. ఇక సెక్టార్ల వారీగా ఇండెక్సుల్లో మిశ్రమ ధోరణి కనిపించింది. బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్ 616 పాయింట్ల నష్టంతో 50,988.80 పాయింట్ల వద్ద ముగిసింది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ 2.53 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.94 శాతం నష్టపోయాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, నిఫ్టీ మీడియా, నిఫ్టీ మెటల్, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ ఓఎంసీ ఇండెక్సులు 1.26 శాతం లాభ పడ్డాయి. మరోవైపు నిఫ్టీ ఫైనాన్సియల్ సర్వీసెస్, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్, నిఫ్టీ హెల్త్ కేర్ ఇండెక్సులు 1.44 శాతం వరకూ నష్టాలతో ముగిశాయి.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332